క్లుప్తంగా

నేడు మున్సిపల్ కౌన్సిల్ అత్యవసర సమావేశం

తెనాలి అర్బన్: తెనాలి మున్సిపల్ కౌన్సిల్ అత్యవసర సమావేశాన్ని సోమవారం ఉదయం 11 గంటలకు నిర్వహించనున్నట్లు కమిషనర్ బండి శేషన్న ఒక ప్రకటనలో తెలిపారు. మున్సిపల్ కార్యాలయంలో కౌన్సిల్ హాల్‌లో జరిగే సమావేశానికి చైర్‌పర్సన్ తాడిబోయిన రాధిక అధ్యక్షత వహిస్తారని ఆయన పేర్కొన్నారు. కౌన్సిలర్లు, కో-ఆప్షన్ సభ్యులు, ఎక్స్ అఫీషియో సభ్యులు పాల్గొనాలని ఆయన కోరారు.

బాలుర హైస్కూలు విద్యార్థికి ఉత్తమ ఎన్‌సీసీ అవార్డు



తెనాలి: ఎన్‌సీసీ దినోత్సవం సందర్భంగా ప్రతి సంవత్సరం కేడేట్లకు ఇచ్చే ఉత్తమ అవార్డు స్థానిక కొత్తపేటలోని శ్రీరావి సాంబయ్య మున్సిపల్ బాలుర హైస్కూలు విద్యార్థి యడ్ల తరుణ్‌కు లభించింది. జూనియర్ డివిజన్ విభాగంలో ఈ అవార్డును గెలుచుకున్న తరుణ్ ఆదివారం గుంటూరు గ్రూప్ కమాండర్ కల్నల్ ఎస్.ఎం. చంద్రశేఖర్ చేతులమీదుగా అవార్డును అందుకున్నాడు. వరుసగా తమ పాఠశాలకు చెందిన కేడెట్లే ఉత్తమ అవార్డును గెలుచుకుంటున్నట్లు ఎన్‌సీసీ అధికారి పరిశా సర్దార్ తెలియజేశారు. తరుణ్‌ను ప్రధానోపాధ్యాయిని షేక్ మౌలాబి, ఉపాధ్యాయులు అభినందించారు.

నూతన సంవత్సర క్యాలెండర్ ఆవిష్కరణ




తెనాలి అర్బన్: బోసు రోడ్డులోని క్రీస్తు దేవాలయం (టౌన్ చర్చి) నూతనంగా రూపొందించిన 2025 క్యాలెండర్‌ను ఆదివారం పాస్టర్లు దేవరపల్లి ఏసురత్నం, యామర్తి లెనిన్‌బాబు, దగ్గుమల్లి సాల్మన్‌రాజు, మత్తె విజయ భాస్కర్ ప్రకాష్‌బాబు ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఐనంపూడి డేవిడ్‌రాజు, గారపాటి శ్యామ్ ప్రకాశరావు, గురిందపల్లి వేమయ్య, చెరుకూరి సునీల్‌కుమార్, బేతాళ కిశోర్‌బాబు పాల్గొన్నారు.

ఆరు ఇసుక ట్రాక్టర్ల సీజ్



కొల్లిపర: అనుమతులు, వే బిల్లులు లేకుండా శనివారం రాత్రి అక్రమంగా ఇసుక తరలిస్తున్న ఆరు ట్రాక్టర్లను సీజ్ చేసినట్లు ఎస్ఐ కోటేశ్వరరావు తెలిపారు. ఆదివారం స్థానిక పోలీస్ స్టేషన్లో ఆయన మాట్లాడుతూ మండల పరిధిలోని అత్తలూరిపాలెం వద్ద కృష్ణా నదిలో అక్రమంగా ఇసుక తరలిస్తున్నారని సమాచారం రావడంతో దాడులు చేసినట్లు చెప్పారు. ఆరు ట్రాక్టర్ల యజమానులపై కేసు నమోదు చేసి తహసీల్దార్‌కు బదిలీ చేసినట్లు తెలిపారు. ఉచిత ఇసుక తరలించే వాహనాలకు కూడా తప్పనిసరిగా ఆన్‌లైన్‌లో నమోదు చేసుకున్న వే బిల్లు ఉండాలని ఆయన స్పష్టం చేశారు.

ఘనంగా గంగానమ్మ కొలుపులు



కొల్లిపర: మండల పరిధిలోని మున్నంగిలో ఆదివారం కులమత భేధాలు లేకుండా గంగానమ్మ కొలుపులు ఘనంగా నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. ఉదయాన్నే కొలుపులను పురస్కరించుకొని గంగానమ్మ ప్రతిరూపమైన ఘటాన్ని గ్రామంలో ప్రతి వీధిలో మేళ తాళాలతో ఊరేగించారు. అనంతరం ఆలయం వద్దకు తీసుకువచ్చి ప్రత్యేక పూజలు నిర్వహించారు. రైతులు పాడి పశువులతో ఆలయం చుట్టూ తిరుగుతూ పాడిపంటలు సమృద్ధిగా ఉండాలని అమ్మవారిని కోరుకున్నారు. పిల్లలు, మహిళలు మెడలో గారెలు, బూరెలు దండలుగా ధరించి తలపై మొలకెత్తిన గింజలు మూకుడుతో అడుగులు మడుగులు పాటిస్తూ మొక్కుబడులను తీర్చుకున్నారు.

టూ టౌన్ సీఐ బాధ్యతల స్వీకారం

తెనాలి రూరల్: తెనాలి టూ టౌన్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్‌గా రాములుల నాయక్ బాధ్యతలు శనివారం స్వీకరించారు. ఆయన మార్కాపురం నుంచి బదిలీపై ఇక్కడికి వచ్చారు. కాగా సెప్టెంబర్ 12న ఇక్కడ సీఐగా బాధ్యతలు స్వీకరించిన నిసార్ బాషాను గుంటూరు వీఆర్‌కు ఉన్నతాధికారులు పిలిపించారు. గోప్యంగా సీఐల బదిలీ జరగడం ఆదివారం చర్చనీయాంశమైంది.

వన భోజనం.. ఐక్యతకు చిహ్నం

- సందడిగా కార్తిక వన సమారాధనలు
- పలు కుల సంఘాల ఆధ్వర్యంలో నిర్వహణ



సభలో మాట్లాడుతున్న డాక్టర్ చందు సాంబశివరావు

తెనాలి: తెనాలి డివిజన్ కాపు కార్తిక వనసమారాధన ఆదివారం భారీగా నిర్వహించారు. స్థానిక వ్యవసాయ మార్కెట్ యార్డులో జరిగిన వనసమారాధనకు వేలాదిమంది కాపు సంఘీయులు తరలివచ్చారు. పిల్లలు, పెద్దలతోపాటు వివిధ రంగాల్లోని ప్రముఖులు వేడుకకు హాజరయ్యారు. ప్రారంభ సభలో కాపు సంఘ ప్రముఖులు మాజీ ఎమ్మెల్యే లింగంశెట్టి ఈశ్వరరావు, తులసీ గ్రూప్ ఆఫ్ ఇండస్ట్రీస్ చైర్మన్ తులసీ రామచంద్రప్రభు, ఇస్రో మాజీ శాస్త్రవేత్త డాక్టర్ చందు సాంబశివరావు, రాష్ట్ర కాపు నాయకుడు గాదె వెంకటేశ్వరరావు, ఆచంటి స్వాములు, మోపిదేవి శ్రీను, తోట రాము, డాక్టర్ చందు సాంబశివుడు, మార్కెట్ యార్డు మాజీ చైర్మన్ తోటకూర వెంకటరమణారావు, చందు జనార్దన్, బండారు రవికాంత్ తదితరులు మాట్లాడారు. కాపు సంఘీయుల ఐక్యత ఆవశ్యకతను తెలియజేశారు. సమస్యల పరిష్కారానికి అన్ని రంగాల్లో ఉన్నతికి పరస్పరం సహకరించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో కాపు కార్తిక వనసమారాధన కమిటీ, తెనాలి బాధ్యులు గ్యాలం వేణు, హరిదాసు గౌరీశంకర్, వద్దిశెట్టి రవి (స్టాలిన్), వల్లెం మురళి, మామిడిబత్తుల సుబ్రహ్మణ్యం పర్యవేక్షించారు.

వైశ్య సంస్థల ఆధ్వర్యంలో...

స్థానిక గంగానమ్మపేటలోని వైశ్య విద్యానిధి ప్రాంగణంలో ఆదివారం ఉదయం నుంచి కార్తిక వనసమారాధనను కోలాహలంగా నిర్వహించారు. వైశ్య విద్యానిధి కమిటీ, వాసవీ సేవా సమితి, పట్టణ ఆర్యవైశ్య సంఘం సంయుక్త ఆధ్వర్యంలో ఈ వేడుకను నిర్వహించారు. మాజీమంత్రి ఆలపాటి రాజేంద్రప్రసాద్ హాజరై, ఆయా సంఘాల నాయకులకు శుభాకాంక్షలు తెలియజేశారు. పట్టణ పరిసర ప్రాంతాల నుంచి 2500 మంది దాకా ఈ వనసమారాధనలో పాల్గొన్నారు. కార్యక్రమాన్ని ఆయా సంస్థల బాధ్యులు పెండేల వెంకట్రావు, పెండేల సుబ్బారావు, తాతా శ్రీనివాసరావు, మద్ది మల్లికార్జునరావు, తాడేపల్లి శివలింగేశ్వరరావు, వెంకట రత్నం, శ్రీమన్నారాయణ, తవ్వా నాగ ప్రసాద్, సుగ్గుల వెంకటప్పయ్య, గోనుగుంట్ల శ్రీనివాసరావు పర్యవేక్షించారు.



మాజీమంత్రి ఆలపాటి రాజాకు సత్కారం

గోవాడ వాస్తవ్యుల వనసమారాధన

పట్టణ మారీసుపేటలోని శ్రీచంద్రమౌళేశ్వరస్వామి కల్యాణ మండపంలో ఆదివారం బాపట్ల నియోజకవర్గం అమృతలమూరు మండల గ్రామం గోవాడ వాస్తవ్యుల కార్తిక వనసమారాధనను ఘనంగా నిర్వహించారు. పావులూరి రమేష్, ఉప్పల సాంబశివరావు, వెంపటి సత్యనారాయణ, తలశిల అమరనాథ్‌ను సత్కరించారు. కార్యక్రమ నిర్వహణకు పావులూరి శ్రీనివాసరావు రూ.10 వేల ఆర్థికసహాయాన్ని అందజేశారు. కార్యక్రమంలో మండల ధనుంజయరావు, ఆలపాటి వీరకుమార్, కొడాలి శ్రీధర్, తుమ్మల జగదీష్, ఉప్పల శేషగిరిరావు, తుమ్మల రామమూర్తి పాల్గొన్నారు.

అగ్రికుల క్షత్రియ సంఘం ఆధ్వర్యంలో ..

అగ్నికుల క్షత్రియ సంఘీయుల కార్తిక వనసమారాధన ఆదివారం స్థానిక నూకల రామకోటేశ్వరరావు కల్యాణ కళాసదనంలో వైభవంగా నిర్వహించారు. మాజీ మంత్రులు మోపిదేవి వెంకటరమణారావు, ఆలపాటి రాజేంద్రప్రసాద్ ముఖ్యఅతిథులుగా హాజరయ్యారు. సంఘీయులు ఐక్యంగా వ్యవహరించాలని, అన్ని రంగాల్లో ఐక్యతకు, సమస్యల పరిష్కారానికి సంఘ ఐక్యత తోడ్పడుతుందని చెప్పారు. సంఘీయుల ఆధ్వర్యంలో మాజీమంత్రులను ఘనంగా సత్కరించారు. కార్యక్రమాన్ని అగ్నికుల క్షత్రియ సంగం అధ్యక్షుడు సైకం లక్ష్మణరావు, అజయ్, రేవు రమణ, తమ్మా వెంకట్రావు, సైకం పార్థసారథి పర్యవేక్షించారు.

శ్రీసాలి గ్రామం మఠం ట్రస్టు ఆధ్వర్యంలో ..

స్థానిక బుర్రిపాలెంరోడ్డులో శ్రీసాలిగ్రామ మఠం ట్రస్ట్ ఆధ్వర్యంలో శ్రీ విద్యాపీఠం ద్వారా నూతనంగా నిర్మిస్తున్న శ్రీసరస్వతీ దేవాలయం ఆవరణలో ఆదివారం కార్తిక వనసమారాధన నిర్వహించారు.



చిన్నారి కూచిపూడి నృత్యం



గోవాడలో ప్రముఖులకు సత్కారం

సరస్వతి దేవాలయం నమూనాను శ్రీబాల స్వామీజీ భక్తులకు ప్రదర్శించారు. భక్తులతో రుద్రాభిషేకం, శ్రీ గణపతి పూజ, పుణ్యాహవాచనం చేయించారు. అన్నవరం సత్యనారాయణస్వామి ప్రసాదాన్ని భక్తులందరికీ అందజేశారు. కార్యక్రమంలో చైర్మన్ నంబూరు వెంకట కష్ణమూర్తి, కార్యదర్శి రావూరి సుబ్బారావు, గడ్డిపాటి శ్రీనివాసరావు, ముద్దాభక్తుని రమణయ్య, గోపు రామకష్ణ, పెనుగొండ వెంకటేశ్వరరావు, కోనా నాగేశ్వరరావు, రాజేశ్వరరావు, సాలిగ్రామ మఠం, శ్రీవిద్యాపీఠం కమిటీ సభ్యులు, జైలక్ష్మీ మాతృమండలి, లలితా సేవా సమితి సభ్యులు పాల్గొన్నారు.

'మానవత' ఆధ్వర్యంలో..

ప్రముఖ స్వచ్ఛంద సేవాసంస్థ మానవత, తెనాలి శాఖ ఆధ్వర్యంలో ఆదివారం కార్తిక వన సమారాధనను వేడుకగా, సంప్రదాయబద్ధగా నిర్వహించారు. అంగలకుదురు-యడ్లపల్లి రోడ్డులోని విశాలమైన నిమ్మతోటలో ఏర్పాటైన ఈ వేడుకలు సాయంత్రం వరకు కొనసాగాయి. ఉదయం అక్కడి ఉసిరి చెట్టుకు పూజలు చేశారు. దాని కిందనే కూరపాటి కళ్యాణి ఆధ్వర్యంలో పలువురు దంపతులతో హోమం జరిపించారు. కూచిపూడి నృత్యగురువు ఆరాధ్యుల తేజస్వి ప్రఖ్య శిష్యబృందం, కోసూరి నివేదితల కూచిపూడి నృత్యాంశాల ప్రదర్శనలు ఆహ్లాదకరంగా సాగాయి. వెంపటి సత్యనారాయణ భక్తిరంజని గీతాలాపన చేశారు. మానవత సభ్యులు, కుటుంబసభ్యులు 500 మందికిపైగా పాల్గొన్న వనసమారాధనలో భోజన అనంతరం పిల్లలు, మహిళలు, పురుషులకు వేర్వేరుగా ఫన్‌గేమ్స్ నిర్వహించారు. విజేతలకు బహుమతులను అందజేశారు. మానవత తెనాలి చైర్మన్ డాక్టర్ కొలసాని రామ్‌చంద్ పర్యవేక్షణలో కార్య నిర్వాహక అధ్యక్షుడు ఓంకార్ ప్రసాద్, కార్యదర్శి పి.వెంకట్, ఉపాధ్యక్షుడు పరిమి వాసు, సంయుక్త కార్యదర్శి డీవీ సోమయ్యశాస్త్రి, పరుచూరి మల్లికార్జునరావు, ఆలపాటి వెంకట్రామయ్య, అయినాల మల్లేశ్వరరావు ఏర్పాట్లను పర్యవేక్షించారు. పట్టణానికి చెందిన ప్రముఖులు డాక్టర్ నన్నపనేని ప్రతాప్, మన్నే హరీష్, బూర్లె నరసింహారావు, ప్రముఖ రచయిత, పరిశోధనకుడు ముత్తేవి రవీంద్రనాథ్, విశ్రాంత పాత్రికేయుడు శివరామప్రసాద్, డాక్టర్ వాసిరెడ్డి నాగేశ్వరప్రసాద్, డాక్టర్ పురుషోత్తం, మొవ్వా సత్యనారాయణ, శాఖమూరి మల్లికార్జునరావు, జొన్నాదుల నరసింహారావు, అక్కల శ్రీరామ్, జొన్నాదుల వెంకటేశ్వరరావు పాల్గొన్నారు. సమాజంలో మానవతను మేల్కొలపడం, ఆత్మీయతను పెంచుకోవటమే సంస్థ లక్ష్యమని డాక్టర్ రామ్‌చంద్ పేర్కొన్నారు.



ఉసిరిచెట్టుకు సంప్రదాయ పూజలు

ఘనంగా 'ఈషా' గ్రామోత్సవ సంబరాలు

కొల్లిపర: గ్రామీణ ప్రాంతాల్లో క్రీడా స్ఫూర్తిని పెంపొందించడానికి అంతర్జాతీయ సేవా సంస్థ ఈషా ఫౌండేషన్ పోటీలు నిర్వహించడం అభినందనీయమని పెదకూరపాడు చైతన్య విద్యాసంస్థల డైరెక్టర్ శ్రీరాము, అవుతు రామిరెడ్డి జూనియర్ కళాశాల సెక్రటరీ బి. ప్రభాకర్‌రెడ్డి అన్నారు. ఆదివారం స్థానిక అవుతు రామిరెడ్డి కళాశాల ప్రాంగణంలో 16వ ఈషా గ్రామోత్సవ సంబరాలు ముగింపు కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథులుగా పాల్గొన్న శ్రీరాము మాట్లాడుతూ ఈషా ఫౌండేషన్ ద్వారా 2023లో నిర్వహించిన గ్రామోత్సవ వేడుకల్లో 60 వేల కంటే ఎక్కువమంది పాల్గొన్నారని, ఇందులో ఎక్కువ శాతం మహిళలే ఉండటం గర్వించదగ్గ విషయమని తెలిపారు. ఈ ఏడాది వేడుకల్లో భాగంగా మండల స్థాయి పోటీల్లో గుంటూరు జిల్లా కేంద్రంగా వాలీబాల్, త్రోబాల్ పోటీలు నిర్వహించినట్లు చెప్పారు. వాలీబాల్‌లో నిజాంపట్నం, త్రోబాల్‌లో ఎలుకలపూడి గెలుపొందినట్లు తెలిపారు. బొమ్మరెడ్డి ప్రభాకర్ రెడ్డి మాట్లాడుతూ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన వాలీబాల్, కబడ్డీ, కోలాటం, జానపద నృత్యాలు, ఇతర సాంప్రదాయ ఆటలతో కళాశాల ప్రాంగణంలో సందడి వాతావరణం నెలకొన్నట్లు చెప్పారు. ఇలా ప్రతి సంవత్సరం మండలంలో ఈషా ఫౌండేషన్ వివిధ పోటీలు నిర్వహించి యువతలో కొత్త ఉత్సాహాన్ని నింపాలని కోరారు. మండలంలో గెలుపొందిన వారు జిల్లాస్థాయిలో పోటీలకు త్వరలో వెళుతున్నట్లు తెలిపారు. అనంతరం వివిధ పోటీలలో గెలిచిన వారికి బహుమతులు, ట్రోఫీలను అందజేశారు. కార్యక్రమంలో వివిధ గ్రామాల నుంచి పోటీలకు వచ్చిన విద్యార్థులు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.



విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న రాము

బీజేపీ నేతల విజయోత్సవం



తెనాలి: మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల్లో ఎన్డీఏ కూటమి విజయాన్ని పురస్కరించుకుని స్థానిక బీజేపీ నాయకులు ఆదివారం విజయోత్సవాన్ని నిర్వహించారు. గాంధీచౌక్‌లో పట్టణ బీజేపీ నాయకుడు శిఖ రవీంద్రబాబు ఆధ్వర్యంలో స్వీట్లు పంచారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు వై.కామేశ్వరరావు, టి.అనంతాచార్యులు, బిట్ర కనకదుర్గ, ఎం.కనకదుర్గ, జి.కళావతి, లక్ష్మి, దుద్దుకూరి హనుమంతరావు, అడుసుమల్లి సుధాకర్, లక్ష్మణ్‌నాయక్, యోగానంద కిషోర్, కుశాల్‌జైన్, సందీప్, కఠారి వాసుదేవనాయుడు, డి.వీరయ్య, కె.శ్రీనివాసరావు, వెంకటేశ్వరరావు, టి.రఘు పాల్గొన్నారు.

హైస్కూలు స్థలదాత విగ్రహావిష్కరణ



తెనాలి: రూరల్ మండల గ్రామం సంగంజాగర్లమూడిలోని జిల్లాపరిషత్ హైస్కూలులో 1991-92లో చదివిన పదో తరగతి విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం ఆదివారం ఘనంగా నిర్వహించారు. గతంలో హైస్కూలు స్థలాన్ని వితరణగా ఇచ్చిన దాత కొత్త వెంకయ్య చౌదరి విగ్రహాన్ని అక్కడి ఆవరణలో ఆవిష్కరించారు. పూర్వగురువులు, 1991-92లో విద్యాబోధన చేసిన ఉపాధ్యాయులను సత్కరించారు. కార్యక్రమాన్ని నారాయణ మూర్తి, రమణ, బి.ప్రతాప్, కాశేశ్వరరావు, రోశయ్య, మురళి, శ్రీనివాస చంద్రశేఖర్, సోమశేఖర్, కిశోర్ పర్యవేక్షించారు. ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

శ్రీ సిద్ధి విఘ్నేశ్వరస్వామి దేవస్థానంలో అన్నదానం



తెనాలి: పవిత్ర కార్తిక మాసం సందర్భంగా స్థానిక బాలాజీరావుపేటలోని శ్రీ సిద్ధి విఘ్నేశ్వరస్వామి దేవస్థానంలో ఆదివారం అన్నదానం చేశారు. గుంటూరులోని సంగడిగుంట సాయిబాబా దేవస్థానం చైర్మన్ లక్ష్మీనారాయణ, స్థానిక ప్రముఖుడు రావి క్రష్ణమోహన్(చిన్ని) ముఖ్య అతిథులుగా హాజరై కార్యక్రమాన్ని ప్రారంభించారు. తెనాలికి చెందిన చెరుకూరి రమేష్ బాబు ఆధ్వర్యంలో గత పదిహేనేళ్లుగా ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నారనీ, అందరి సహకారంతో నిర్విరామంగా జరగాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో మొవ్వా పున్నయ్య, డాక్టర్ దొండపాటి కోటేశ్వరరావు, జొన్నలగడ్డ శ్రీరామచంద్రమూర్తి, ఆలయ ప్రధాన అర్చకుడు మల్లికార్జునరావు పాల్గొన్నారు.

కొలకలూరులో కార్తిక 'నగర సంకీర్తన'



తెనాలి: కొలకలూరులో కార్తిక మాసం సందర్భంగా శ్రీఅగస్త్యేశ్వరస్వామి ఆలయం తరఫున భక్తులు ఆదివారం తెల్లవారుజామున నగర సంకీర్తన చేశారు. ఉదయం 4.30 గంటల నుంచి 5.30 గంటల వరకు హరి నామ, శివనామ సంకీర్తనలు చేశారు. గ్రామ క్షేమాన్ని కాంక్షిస్తూ ప్రతిరోజూ నగర సంకీర్తనలు చేస్తున్నట్లు నిర్వాహకులు తాళ్లూరు సుబ్బారావు, మలిశెట్టి శ్రీనివాస్ తెలియజేశారు.

ఉద్యోగం ఇప్పిస్తామని భార్యాభర్తల మోసం

తెనాలి రూరల్: ఉద్యోగం ఇప్పిస్తామని యువకుడిని భార్యాభర్తలు మోసం చేయడంపై తెనాలి త్రీ టౌన్ పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదైంది. పోలీసులు కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. పట్టణ మారిస్‌పేటకు చెందిన కనపర్తి మహేష్‌బాబుకు రాయనపాడు రైల్వే వర్క్‌షాప్‌లో ఉద్యోగం ఇప్పిస్తామంటూ అతనికి పరిచయస్తులైన మరియదాసు, అతని భార్య సౌజన్య జనవరిలో రూ. 4.60 లక్షలు తీసుకున్నారు. 11 నెలలైనా ఉద్యోగం రాకపోవడం, డబ్బులు తిరిగి ఇవ్వమన్నా ఇవ్వకపోతుండడంతో బాధితుడు పోలీసులను ఆశ్రయించాడు.

వాసవీ మాత ఆలయంలో కోటి దీపోత్సవం



దీపోత్సవంలో పాల్గొన్న మహిళలు

తెనాలి: పవిత్ర కార్తిక మాసం సందర్భంగా స్థానిక బోసురోడ్డులోని శ్రీవాసవీ కన్యకాపరమేశ్వరి అమ్మవారి దేవస్థానం ప్రాంగణంలో ఆదివారం రాత్రి కోటి దీపోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. శ్రీవాసవీ మాత ఫ్రెండ్ సర్కిల్ ఆధ్వర్యంలో జరిగిన ఈ క్రతువులో వందలాది మహిళలు పాల్గొన్నారు. దేవస్థానం కమిటీ అధ్యక్షుడు నూకల వెంకటవేణుగోపాలరావు, పాలకవర్గ సభ్యులు పర్యవేక్షించారు. కార్యక్రమంలో సభ్యులు మద్దాలి యశ్వంత్ గుప్తా, కోడూరు రామబ్రహ్మం, నాళం దిలీప్‌కుమార్, కొమ్మూరు సురేంద్ర, ఎం.సాయివెంకటేష్, బియ్యపు సాయి, మద్దాలి ప్రణీత్, చేబ్రోలు కిశోర్, విజయ్ కుమార్, సురేష్ కుమార్, గురవయ్య, అన్నా వెంకటేష్ బాబు, ఫణి సంపత్, కే మహేష్ కుమార్ , చీదేళ్ల పవన్ కుమార్, ఆలపాటి విజయ సాయి, దినేష్ కుమార్, దేసు హాసిని, శ్రీనాగ ప్రశాంతి, దివ్య నాగశ్రీ , దిలీప్ కుమార్ పాల్గొన్నారు.

వైకుంఠపురంలో సామూహిక సత్యదేవ వ్రతాలు

తెనాలి: పవిత్ర కార్తిక మాసాన్ని పురస్కరించుకుని స్థానిక శ్రీలక్ష్మీ పద్మావతీ సమేత శ్రీవేంకటేశ్వర స్వామి దేవస్థానం, వైకుంఠపురంలో శ్రీ రమాసహిత సత్యదేవ వ్రత మహోత్సవాలను నాలుగో ఆదివారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఏటా కార్తిక మాసంలో వరుసగా ప్రతి ఆదివారం వ్రతాలు నిర్వహించడం ఇక్కడ ఆనవాయితీ. ఇందులో భాగంగా 4వ ఆదివారం ఉదయం నుంచి జరిగిన వ్రతాల్లో 192 మంది దంపతులు పాల్గొన్నారు. ఆలయ కార్యనిర్వహణాధికారి వి.అనుపమ, ట్రస్ట్ బోర్డు చైర్మన్ కుంభం సాయిబాబు నేతృత్వంలో దేవస్థానంలో ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. ఆలయ అర్చకులు భక్తులతో వ్రతాలను శాస్త్రోక్తంగా జరిపించారు. స్వామికి ఉదయం నుంచి విశేషంగా అభిషేకాలు నిర్వహించారు. కార్తిక మాసం హరిహరాదులకు ఎంతో ప్రీతిపాత్రమైందని, ఈ మాసంలో శ్రీ సత్యనారాయణ వ్రతాలు జరిపించుకోవడం ఎంతో శుభప్రదమని అధికారులు తెలిపారు. కార్తిక మాసంలో చివరి ఆదివారమైన డిసెంబరు ఒకటో తేదీన వ్రత మహోత్సవాల్లో పాల్గొనదలచిన దంపతులు రూ.1000 చెల్లించి పేర్లు, గోత్రం నమోదు చేయించుకోవాలని ఈవో అనుపమ తెలియజేశారు. ట్రస్ట్ బోర్డు సభ్యులు బొద్దులూరి సరస్వతి నాగేశ్వరరావు, కురగంటి సునీత రవిశంకర్, దేవరకొండ వెంకట రమణ శంకరరావు, మావులూరి శ్రీనివాస్, ఎక్స్‌అఫీషియో సభ్యుడు అశోహరి రవికుమార్, దేవస్థాన సిబ్బంది పాల్గొన్నారు.

వైఖానస సేవా సంఘం సేవలు అభినందనీయం

తెనాలి: వైఖానస సేవా సంఘం సేవలు అభినందనీయమని రాష్ట్ర ఆర్థికమంత్రి ముఖ్య కార్యదర్శి వేదాంతం శ్రీనివాసమూర్తి అన్నారు. వైఖానస సేవా సంఘం ఆధ్వర్యంలో ఆదివారం స్థానిక సుల్తానాబాద్‌లోని శ్రీరామకృష్ణ మనోహర్ ఆశ్రమ ప్రాంగణంలో కార్తిక వనసమారాధన నిర్వహించారు. సంఘ అధ్యక్షుడు మేడూరి శ్రీనివాసమూర్తి అధ్యక్షతన జరిగిన సభలో ముఖ్యఅతిథిగా వేదాంతం శ్రీనివాసమూర్తి మాట్లాడారు.సంఘీయులు ఐకమత్యంగా ఉన్నప్పుడే సమస్యలను సులువుగా పరిష్కరించుకోవచ్చని తెలిపారు. అర్చక వృత్తిలో ఉన్నవారు గౌరవప్రదంగా వ్యవహరించాలని సూచించారు. అనంతరం తిరుపతి రాష్ట్రీయ విద్యాపీఠంలో ఎంఏ సంస్కృతంలో ప్రథమునిగా నిలిచి ఉప రాష్ట్రపతి నుంచి ఐదు గోల్డ్ మెడల్స్ అందుకున్న రొంపిచర్ల యశ్వంత్ దీక్షితులను సంఘ సభ్యులు సత్కరించారు. నల్లూరు అనంతశయనం దంపతులు సత్యనారాయణస్వామి వ్రతం నిర్వహించారు. శ్రీభాష్యం శ్రీనివాస్ దీక్షితులు, శ్రీభాష్యం జోగినాథ్ పవన్ కుమార్ దంపతులు అన్న సమారాధన నిర్వహించారు, పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశారు. ప్రధాన కార్యదర్శి మాధవ కుమార్, ఆర్గనైజింగ్ కార్యర్శి తమిరిశ రఘు, కోశాధికారి దీవి యోగానంద చక్రవర్తి పర్యవేక్షించారు.



పండిత యశ్వంత్ దీక్షితులుకు సత్కారం

యువ వైఖానసుల నూతన కార్యవర్గం

ఇదే వేదికపై యువ వైఖానస అసోసియేట్స్ నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా డాక్టర్ నారాయణం అనిల్ కుమార్, ఉపాధ్యక్షులుగా శ్రీభాష్యం అనిల్ కుమార్, తమిరిశ శ్రీకాంత్, నారాయణం గోవర్ధన రఘురాం, ప్రధాన కార్యదర్శిగా శ్రీభాష్యం సాకేత్, కోశాధికారిగా తమిరిశ యశ్వంత్ మహిళా విభాగం కన్వీనర్‌గా దివి సర్వజ్ఞ సింధు, విజయవాడ జోన్ కన్వీనర్ గా పరాశరం బాలమురళీకృష్ణ, కౌన్సిల్ సభ్యులను ఎన్నుకున్నారు.

షుగరు వ్యాధి వైద్య శిబిరానికి స్పందన



తెనాలి: పట్టణానికి చెందిన డీ3 శారద సర్వీస్ సొసైటీ ఆధ్వర్యంలో ప్రతి నెలా చివరి ఆదివారం నిర్వహిస్తున్న ఉచిత షుగరు వ్యాధి వైద్య శిబిరం ఈ వారం కొనసాగింది. బుర్రిపాలెంరోడ్డులోని ఎస్. భవనంలో ఏర్పాటైన శిబిరంలో పరిసర గ్రామాల నుంచి వచ్చిన రోగులకు డాక్టర్ శారద రక్త, బీపీ, బరువు పరీక్షలు చేశారు. అల్పాహారం అందించి మరోసారి పరీక్షలు చేశారు. దాదాపు 200 మందికి షుగరు, బలం, కాల్షియం మందులను అందజేశారు. గుండె సంబంధ అనుమానం కలిగిన వారికి గుర్తించి ట్రికాగ్ ద్వారా ఈసీజీలు తీశారు. సమస్య అనిపించిన వారిని హాస్పిటల్‌కు రిఫర్ చేశారు. ఆహార నియమాలపై అందరికీ అవగాహన కల్పించారు.

మహాయోగి శ్రీ అరవిందు సిద్ధి దినోత్సవం



తెనాలి: మహాయోగి శ్రీ అరవిందుల సిద్ధి దినోత్సవం సందర్భంగా ఆదివారం నాజరుపేటలోని శ్రీ అరవింద విద్యా కేంద్రం ప్రాంగణంలోని శ్రీ మాతారవింద ధ్యాన మందిరంలో భక్తులు పుష్పాలను సమర్పించి, సామూహిక ధ్యానం చేశారు. విద్యార్థుల మార్చ్‌ఫాస్ట్ అనంతరం పరుచూరి లావణ్య శ్రీమాత పతాకావిష్కరణ చేశారు. సభకు విద్యాకేంద్రం డైరెక్టర్ కె.సంపూర్ణ అధ్యక్షత వహించారు. శ్రీ అరవిందుల సిద్ధి దినోత్సవం ప్రాధాన్యతను తెలియజేశారు. పాండిచ్చేరిలోని శ్రీ అరవింద ఆశ్రమం నుంచి వచ్చిన సందేశాన్ని సయ్యద్ బాషా చదివి వినిపించారు. ప్రధానోపాధ్యాయిని ఆర్.నిర్మలకుమారి, ఉపాధ్యాయులు కె.మురళీమోహన్ దివ్యదీపిక పత్రికను ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఎస్.ప్రమీల, పి.లావణ్య, వి.నాగమల్లేశ్వరి, కె.వెంకట్రావు,

కొలకలూరు ఆశ్రమంలో ధ్యాన సత్సంగ్ వేడుకలు



తెనాలి: హార్ట్‌ఫుల్‌నెస్ సంస్థ, శ్రీరామచంద్ర మిషన్ ఏపీ-ఐసీ-3 జోన్ ఆధ్వర్యంలో ఆదివారం రూరల్ మండలం కొలకలూరులోని జోనల్ ఆశ్రమంలో మినీ భండారా తరహాలో వేడుకలు జరిగాయి.జోన్ పరిధిలోని గుంటూరు, తెనాలి, బాపట్ల, చిలకలూరిపేట, నరసరావుపేట, వినుకొండ, మాచర్ల, పిడుగురాళ్ల, సత్తెనపల్లి, పొన్నూరు, రేపల్లె తదితర కేంద్రాలకు చెందిన అభ్యాసులు 850 మందికి పైగా పాల్గొన్నారు. పచ్చని పరిసరాలు, స్వచ్ఛమైన వాతావరణంలో ఉదయం నుంచి సాయంత్రం వరకు సాధకులు మూడు ధ్యాన సత్సంగ్‌లను నిర్వహించారు. హార్ట్‌ఫుల్‌నెస్ పద్ధతికి సంబంధించిన విశేషాలను, మాస్టర్, మిషన్, మెథడ్‌లను సంస్థలో కొత్తగా చేరిన వారికి సీనియర్ సభ్యులు వివరించారు. కార్యక్రమాన్ని ఏటా ఒకటి లేదా రెండుసార్లు నిర్వహించాలని అభ్యాసులు కోరారు. సంస్థ జోనల్ కో-ఆర్డినేటర్ ఎస్. రామకోటేశ్వరరావు పర్యవేక్షించారు.